క్లుప్తంగా

వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు రేపు

బంగారుపాళెం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను శని వారం పూతలపట్టు నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనం గా నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనరు రామచంద్రారెడ్డి గురువారం తెలిపారు. జగన్ పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద కేక్ కట్ చేయ నున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

వరసిద్ధునికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన అభివృద్ధికి ఓదాత గురు వారం నగదు విరాళం చేశారు. హైదరాబాద్‌కు చెందిన విద్యాసాగర్‌రెడ్డి రూ. లక్ష నగదును ఆలయ అభివృద్ధికి అందజేశారు. ఆయనకు ఆలయ అధికారులు దర్శనం కల్పించి స్వామి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది బాలాజీ నాయుడు తదితరులున్నారు.

దుస్తుల పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): క్రిస్మస్‌ను పురస్కరించుకుని చిత్తూరు నగరం ఇరువారం ప్రాంతంలోని లెప్రసీ సెంటర్‌లో ఉన్న వృద్ధులకు గురువారం శ్రీసత్యసాయి నిర్వాహకులు దుస్తులు పంపిణీ చేశారు. 40 మంది వృద్ధులకు చీరలు, టవల్స్, ప్యాంట్ షర్ట్ తదితరాలను అందజేశారు. అనంతరం స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ప్రభాకర్, శేషనారాయణ, మధుసూదనం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇస్తున్న రిసోర్సు పర్సన్లు

బంగారుపాళెం: గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో గురువారం స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల(ఎల్‌ఎస్‌డిజి)పై రెండో రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధితోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమని, అందుకు ఉత్తమ ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ ఉద్యోగులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ గణపతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రెడ్డి కళ్యాణి పాల్గొన్నారు.

దళిత హక్కుల పోరాట సమితి నిరసన



నిరసన తెలుపుతున్న దళిత హక్కుల పోరాట సమితి నాయకులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను సభలో కించపరిచిన అమిత్ షాపై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. చిత్తూరు నగరం దర్గా సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆ సంఘ నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. పార్లమెంటులో అమిత్ షా అంబేడ్కర్ బదులుగా దేవుడిని స్మరిస్తే పుణ్యం కలుగుతుందని వెటకారంగా మాట్లాడటం సరికాదన్నారు. దీంతో బీజేపీ ప్రభుత్వ నిజస్వరూపం బయటపడిందని తీవ్రంగా విమర్శించారు. అంబేడ్కర్‌ని కించపరచడం దుర్మార్గపు చర్యగా తాము భావిస్తున్నామన్నారు. పార్లమెంటుకు సంబంధించిన అధికారులు అమిత్‌షాపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, దామోదరం, గోపినాథ్, కేమణి, ధనంజయ, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

జాతరలో పోలీసుల సేవలు



సేవలు అందించిన పోలీసు అధికారులు

కార్వేటినగరం: గ్రామ దేవత శ్రీబంగారమ్మ జాతర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించిన పోలీసులకు ఎప్పటికీ రుణపడి ఉంటామని ఆలయ అధ్యక్షుడు ప్రసాద్ కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. గురువారం జాతర వేడుకల్లో విధులు నిర్వర్తించిన సీఐలు, ఎస్‌ఐలు, 100 మంది సిబ్బందిని ఆలయం తరఫున సన్మానించి ఆలయ అధ్యక్షుడు మాట్లాడారు. ఈ ఏడాది గ్రామ యువత, పోలీసు అధికారులతో కలసి ప్రశాంతమైన వాతావరణంలో జాతర వేడుకలు నిర్వహించారన్నారు. ఎస్‌ఐ రాజ్‌కుమార్ మాట్లాడారు.

హిమపాశం

శీతలగాలులతోపాటు మంచు కమ్మేస్తుండడంతో రోజురోజుకూ చలి తీవ్రత పెరుగుతోంది. యమపాశం ప్రాణాలు తీస్తే ఈ హిమపాశంతో ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు చలికి వణికిపోతున్నారు.



బంగారుపాళెం: తెల్లవారుజామున రోడ్డును కమ్మేసిన పొగమంచు, (ఇన్‌సెట్) ఉన్ని దుస్తులకు పెరుగుతున్న ఆదరణ

- ముంచుకొస్తున్న ఆరోగ్య ముప్పు
- కనిష్ట స్థాయికి ఉష్ణోగ్రతలు
- వణికించే చలిలో వాకింగ్ వద్దు
- గుండె, శ్వాస సమస్యలకు ఆస్కారం

బంగారుపాళెం: చలి పెరుగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. తీసుకునే ఆహారం నుంచి ధరించే దుస్తుల వరకు పలు జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. చలిలో తిరగడం వల్ల న్యూమోనియాతో పాటు శ్వాస సంబంధిత వ్యాధులు, ఎలర్జీ వంటివి వచ్చే అవకాశం ఉంది. ఆస్తమా వ్యాధిగ్రస్తులు మరింత జాగ్రత్తగా ఉండాలి. నిత్యంవాడే ముందులను ఎప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలి. హృద్రోగులు, పిల్లలు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. శరీరం ఎప్పుడూ వెచ్చగా ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి. ఉన్ని దుస్తులు దుమ్ము, ధూళి లేకుండా చూసుకోవాలి.

ముప్పు ఇలా..

వైద్యులు చెబుతున్న దాని ప్రకారం.. మంచులో నడక మంచిదికాదు. అప్పటికే నిద్రాణ స్థితిలో లేదా స్వల్ప తీవ్రతతో ఉన్న గుండె, శ్వాసకోశ సమస్యలు తిరగబెట్టే ప్రమాదం ఉంటుంది.

- కోవిడ్ తదనంతర ప్రభావంతో చిన్న వయసు వారిలో కూడా వైద్యులు గుండె బబ్బులు గుర్తిస్తున్నారు. యావత్ ప్రపంచాన్నే అతలాకుతలం చేసిన కోవిడ్ మహమ్మారి చలికాలంలో అక్కడక్కడ తన ఉనికిని చాటుకుంటోంది. అప్పటికే పలు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న వారు.. మంచులో మార్నింగ్ వాక్‌కు వెళ్లే కోవిడ్ ప్రభావం అధికంగా ఉంటోందని వైద్యులు చెబుతున్నారు. పోస్ట్ కోవిడ్ ప్రభావానికి గురైన వారు ఎట్టి పరిస్థితుల్లోనూ మంచులో నడక కొనసాగించవద్దని సూచిస్తున్నారు.
- ఆస్తమా బాధితులకు చలికాలం ఓ సవాలు వంటిది. చల్లగాలుల వల్ల ఆస్తమా అనుబంధ శ్వాస సమస్యలు అధికమవుతాయి. అటువంటి వారు మంచులో మార్నింగ్ వాక్ మొదలు పెడితే అనర్థాలు మరింత పెరగవచ్చు. మార్నింగ్ వాక్ చేస్తే ఆస్తమా బాధితులు గురక, ఛాతి భారంగా మారడం, శ్వాస సరిగ్గా తీసుకోలేకపోవడం, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే నడకను ఆపేయాలి. వైద్యులను సంప్రదించాలని సూచించారు.

వాకింగ్‌కు వెళ్లేటప్పుడు..

- వాస్తవంగా చలి గాలుల్లో సూక్ష్మక్రిములు అధికంగా ఉంటాయి.
- గాలి ద్వారా శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంటుంది. అందుకే ఉదయం వాకింగ్, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ముక్కు, చెవుల్లోకి గాలి వెళ్లకుండా మంకీ క్యాప్ ధరించాలి.
- వేకువ జామున వాకింగ్‌కు వెళ్లడం అంత మంచిది కాదు.
- సూర్యకిరణాలు పడిన తరువాత శరీరంలో ఉష్ణోగ్రతలు పెంచేలా జాగింగ్‌తో పాటు వ్యాయామం చేస్తే మంచిదని వైద్యులు చెబుతున్నారు.



క్రీడామైదానంలో బాస్కెట్ బాల్ ఆడుతున్న క్రీడాకారులు

జాగ్రత్తలు పాటించాలి

చలికాలంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలంటున్నారు డాక్టర్లు. చల్లని వాతావరణంలో ఆరు బయట తిరగరాదని సూచిస్తున్నారు. శరీరాన్ని పూర్తిగా కప్పేలా దుస్తులు ధరించాలి.

- తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి.
- జలుబు, దగ్గు రెండు రోజులైనా తగ్గకపోతే డాక్టర్లను సంప్రదించాలి
- నీళ్లు ఎక్కువగా తాగాలి. వ్యాజలిన్ పెట్రోలియం జల్లీలు చర్మానికి రాయాలి.
- తెల్లవారు జామున, రాత్రి వేళ స్నానం చేయరాదు.
- చిన్నారులను బయటకు తీసుకురాకూడదు.
- అత్యవసరంగా బయటకు తీసుకెళ్లాలంటే తలకు, శరీరాన్ని పూర్తిగా కప్పేలా దుస్తులు తొడిగించాలి.

వాకింగ్‌కు ఈ వేళలు మేలు



నిమోనియా, ఆస్తమా వ్యాధిగ్రస్తులు శీతాకాలంలో ఉదయం వాకింగ్‌కు వెళ్లవద్దు. చల్లటి గాలి శ్వాస ప్రక్రియకు ఇబ్బందికరంగా మారుతుంది. చలికాలంలో మార్నింగ్ వాక్ కొన్ని సార్లు ప్రమాదకరం. సమయాన్ని అనుసరించి నడక కొనసాగించాలి. మిగిలిన సీజన్లలో మాదిరిగా తెల్లవారుజామున నడక శీతాకాలంలో ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు. రాత్రి వేళల్లోనూ చల్లదనం కమ్మేస్తుంది. ఈవినింగ్ వాక్‌కు కూడా మంచు ప్రభావం లేని ఓ నిర్దిష్ట సమయాన్ని ఎంచుకోవాలి. ఉదయం 8.30–9.30 గంటల మధ్య, సాయంత్రం 5–6 గంటల మధ్య నడక మంచిది.

–డాక్టర్ శిరీష, సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి, బంగారుపాళెం

హెల్మెట్లు ధరించండి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

చిత్తూరు అర్బన్: ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు కోరారు. హెల్మెట్ల వాడకంపై గురువారం ట్రాఫిక్ పోలీసులతో కలిసి చిత్తూరు నగరంలో ద్విచక్ర వాహనాలపై ర్యాలీ నిర్వహించారు. సీఐ నిత్యబాబు మాట్లాడుతూ హెల్మెట్లు లేకుండా వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు ప్రమాదాలు జరిగితే ప్రాణాలు పోతున్నాయన్నారు. ఇటీవల రాష్ట్ర హైకోర్టు సైతం హెల్మెట్లను తప్పనిసరి చేసిందనే విషయాన్ని వాహన చోదకులు గుర్తించుకోవాలని సూచించారు.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న జడ్జి భారతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో ఉన్న వృద్ధులకు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి భారతి దుప్పట్లను అందచేశారు. కట్టమంచిలోని నిరాశ్రయుల కేంద్రంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఈఎంసీ ఫౌండేషన్ వాళ్ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నిరాశ్రయులకు దుప్పట్లను అందజేశారు. నిరాశ్రయులకు సైతం చట్టం సమానంగానే వర్తిస్తుందని చెప్పారు. ఉచిత న్యాయసేవల కోసం చిత్తూరులోని జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు జోసెఫ్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణకు ప్రజలందరూ సహకరించాలి



సమావేశంలో హాజరైన చిత్తూరు నగర వాసులు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో రోడ్లను విస్తరించడానికి భవన యజమానులు సహకరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో గురువారం చిత్తూరు నగరాన్ని స్మార్ట్ సిటీ అభివృద్ధి చేయడంపై ప్రజలతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం అభివృద్ధి చెందాలంటే ప్రజల అందరి సాకారం అవసరమన్నారు. భవనాలు కోల్పోయేవారికి పరిహారం అడుగుతున్నారని.. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. రాజమండ్రి లాంటి నగరాల్లో కూడా పరిహారం కింద టీడీఆర్ బాండ్లనే ఇచ్చామని కలెక్టర్ గుర్తు చేశారు. చిత్తూరు ఎమ్మెల్యే జగన్‌మోహన్ నాయుడు మాట్లాడుతూ రోడ్డు విస్తరణ జరిగితేనే చిత్తూరు స్మార్ట్ సిటీగా అవతరిస్తుందన్నారు. పూర్తిగా ఇళ్లు కోల్పోయేవారికి న్యాయం చేస్తామన్నారు. చిత్తూరు అభివృద్ధి ప్రతి ఒక్కరి కలన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ హేమలత, జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, ఆర్డీవో శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఉద్యోగుల నిరసన



ఎస్‌ఈ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

చిత్తూరు కార్పొరేషన్: ఉత్తరప్రదేశ్, చండీగఢ్ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయం వద్ద విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని దశలవారీగా దేశమంతా అమలు చేసే యోచనలో ఉందన్నారు. ప్రైవేటు వ్యక్తుల సేవలు ఎలా ఉంటాయో కరోనా సమయంలో చూశామన్నారు. వారు లాభాపేక్ష తప్ప సేవ చేయాలనే ఉద్దేశం ఉండదన్నారు. జవాబుదారీతనం లోపించి పాలన సక్రమంగా జరగదని పేర్కొన్నారు. భవిష్యత్‌లో విద్యుత్‌శాఖతో పాటు ఇతర ప్రభుత్వశాఖలను ప్రైవేటు చేసినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు గోవిందరాజులు, శ్రీరాములు, గోవిందన్, రవిచంద్ర, వివేకానందరెడ్డి, శ్రీనివాసన్, సురేష్, రాజశేఖర్, పరంధామరెడ్డి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలి

చిత్తూరు కలెక్టరేట్: పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పోటుగారి భాస్కర్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులు గురువారం జిల్లా కేంద్రంలోని గాంధీ రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం విభజించు పాలించు అనే ధోరణిలో పరిపాలన సాగిస్తోందని విమర్శించారు. అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్‌ను అవమానించి ప్రజల మనోభావాలు దెబ్బతినేలా అమిత్‌షా ప్రవర్తించారని ఆరోపించారు. బీజేపీకి మద్దతిస్తున్న టీడీపీ, జనసేన పార్టీలు తమ మద్దతును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రగిరి నియోజకవర్గ కో–ఆర్డినేటర్ లోకేష్ రెడ్డి మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఎద్దేవా చేశారు. జీడీ నెల్లూరు కో–ఆర్డినేటర్ రమేష్ బాబు మాట్లాడుతూ పేద వర్గాల ఆరాధ్యదైవం అంబేడ్కర్ అని ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని అన్నారు. ఏపీసీసీ మాజీ కార్యదర్శి ఏపీ పరదేశి మాట్లాడుతూ ప్రపంచ మేధావి అంబేడ్కర్‌ని విమర్శించడం రాజ్యాంగాన్ని అవమానించడమేనని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలు కుమారిరెడ్డి, జిల్లా మాజీ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కణ్ణన్, మైనారిటీ నాయకులు కళంధర్ పాల్గొన్నారు.

తుమ్మిందపాళ్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ చంద్రమహేష్

గుడిపాల: ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి చంద్రమహేష్ అన్నారు. మండలంలోని తుమ్మిందపాళ్యంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 61 మందికి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది చంద్రశేఖర్, రాజేశ్వరి, నందిని, వర్షిత, నిరోషా పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని నెల్లిమందపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 60 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. గర్భిణులు విధిగా గుడ్లు, పాలు, చిక్కీ, రాగి, ఎండు ఖర్జూరం ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. ఏ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దివ్యాంగుల శిబిరం రేపు

పుంగనూరు: పట్టణంలోని బసవరాజ హైస్కూల్‌లో ఈనెల 21న దివ్యాంగులు, వయోవృద్ధుల ఉపకరణాల నమోదు శిబిరం నిర్వహిస్తున్నట్లు పలమనేరు ఆర్డీఓ భవాని తెలిపారు. ఆమె తహసీల్దార్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఏఎల్‌ఐఎంసీఓ ద్వారా శిబిరం నిర్వహించి, ఉపకరణాలు అవసరమైన వారి వివరాలు నమోదు చేస్తామన్నారు. శిబిరంలో దివ్యాంగులు, వయోవృద్ధులు పాల్గొని తమకు అవసరమైన పరికరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

పరీక్షల విధానంలో అసంబద్ధ విధానాలు



డీఈవో వరలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: కూటమి ప్రభుత్వం పరీక్షల విధానంలో అమలు చేస్తున్న అసంబద్ధ విధానాలను రద్దు చేయాలని ఫ్యాప్టో సంఘ నాయకులు గంటామోహన్, చెంగల్‌రాయ మందడి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు పూతలపట్టులో రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటనపై గురువారం డీఈవో వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ గురువారం నిర్వహించాల్సిన సమ్మేటివ్ –1 ప్రశ్నపత్రాలను తీసుకెళుతూ ప్రమాదంలో మృతి చెందిన సిద్ధశెట్టికి ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. ఈ ఘటన చాలా బాధాకరమన్నారు. సమ్మేటివ్ ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరచడం, రోజు రెండు సార్లు దూరప్రాంతాలకు తీసుకెళ్లడం చాలా కష్టతరమన్నారు. ముఖ్యంగా మహిళా టీచర్ల పరిస్థితి మరింత దారుణమని చెప్పారు. ఇలాంటి అసంబద్ధ విధానాల వల్లనే సిద్ధయ్య శెట్టి మృతి చెందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణపై క్షేత్రస్థాయిలో అభిప్రాయాలు, ఇబ్బందులు పరిగణనలోకి తీసుకోకుండా నూతన విధానాలు అమలు చేయడం దారుణమన్నారు. వెంటనే సిద్ధయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో సంఘ నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, భాస్కరరావు, ముక్తార్ అహ్మద్, తులసిబాబు, సారథి, రాజేంద్రన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారిక ఆక్రమణ.. ఎవరూ అడగరనా..!

- చిత్తూరులో ప్రతిష్టాత్మకంగా హైరోడ్డు విస్తరణ
- పీసీఆర్ ప్రభుత్వ స్కూల్ వద్ద రోడ్డును ఆక్రమిస్తున్న కార్పొరేషన్ అధికారులు
- అయినా స్పందించని ఆర్‌అండ్‌బీ అధికారులు



పీసీఆర్ ప్రభుత్వ పాఠశాల ప్రహరీ పక్కన సాగుతున్న షెడ్ల నిర్మాణ పనులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ప్రస్తుతం హాట్ టాపిక్ హైరోడ్డు విస్తరణ. న్యాయస్థానాల సముదాయం నుంచి గిరింపేట వరకు ఉన్న రోడ్డును విస్తరించాలని పాలకులు, అధికారులు పట్టుదలతో ఉన్నారు. కొందరు భవన నిర్మాణ యజమానులు దీనికి ససేమిరా అంటున్నా.. వాళ్ల గోడు ఎవరూ పట్టించుకునే పరిస్థితిల్లో లేరు. ఎలాగూ రోడ్డు విస్తరణ చేయాలని గట్టిగా ఉన్నారు. కానీ ఇదే సమయంలో అధికారులు చేస్తున్న పనులు వివాదాలకు, విమర్శలకు తావిస్తోంది. హైరోడ్డు విస్తరణ చేపడుతూనే.. ఆర్‌అండ్‌బీ రోడ్డును కార్పొరేషన్ అధికారులు దర్జాగా ఆక్రమించుకుని, అదే రోడ్డుపై నిర్మాణాలు చేపడుతుండడమే దీనికి కారణం. చిత్తూరులోని పీసీఆర్ విద్యాసంస్థల నుంచి పుత్తూరు రోడ్డు మొత్తం ఆర్‌అండ్‌బీ పరిధిలోకి వస్తుంది. ప్రస్తుతం కార్పొరేషన్ అధికారులు హైరోడ్డును విస్తరిస్తూ, పాత మున్సిపల్ బస్టాండును స్వాధీనం చేసుకుని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని భావిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ బస్టాండులో ఉన్న వ్యాపారులందరినీ తీసుకొచ్చి పీసీఆర్ విద్యాసంస్థల వద్ద రోడ్డుపై షెడ్లను నిర్మించి, అక్కడ దుకాణాలకు అనుమతి ఇవ్వడం విమర్శలకు కేంద్ర బిందువుగా నిలుస్తోంది. గతంలో పనిచేసిన ఎమ్మెల్యే సత్యప్రభ.. పీసీఆర్ పాఠశాల ప్రహరీ గోడను తొలగించి, అక్కడ రోడ్డును విస్తరించి, వెడల్పు చేయించారు. కానీ ఇపుడు అధికారులు కార్పొరేషన్ నిధుల్లో నుంచి రూ.20 లక్షలు వెచ్చించి మరీ రోడ్డును అధికారికంగా ఆక్రమించుకుని మరీ షెడ్లు నిర్మిస్తున్నారు. ఆక్రమణదారులకు ఇలా రోడ్లపై షెడ్లు వేసి ఇవ్వాలంటే.. నగరం అభివృద్ధి చెందినట్టేనని పలువురు నిట్టూరుస్తున్నారు. రోడ్లపై షెడ్లు వేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు పాఠశాల వద్ద పిల్లల ఏకాగ్రత కూడా దెబ్బతింటుందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళ్లెదుటే ఇంత జరుగుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎవరైనా తమ రోడ్డుపై చిన్న గుంత పెడితే ఒప్పుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు.. అనుమతి కూడా తీసుకోకుండానే కార్పొరేషన్ అధికారులు పనులు చేపడుతున్నా మౌనంగా ఉండడం వెనుక మర్మమేమిటని మేధావులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఇన్నేళ్లు ఇక్కడ ఆటో స్టాండు పెట్టుకుని జీవనాధారం కోసం పొట్టపోసుకుంటున్న తమను బయటకు గెంటేసి, ఎవరో వ్యాపారులను తీసుకొచ్చి షెడ్లను వేయడం ఎంత వరకు సమంజసమని, దీనికి అధికారులే సమాధానం చెప్పాలని ఆటో కార్మికులు కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు.



కార్పొరేషన్ కార్యాలయం వద్ద పీసీఆర్ ఆటో డ్రైవర్ల నిరసన

అమ్మ గౌరవంకు తాళం

చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ప్రసూతి విభాగంలో అమ్మకు గౌరవం పేరుతో పిల్లలకు పాలిచ్చే గదిని ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో తల్లులు ఇక్కడికి వచ్చి, తమ బిడ్డలకు పాలుపడుతుంటారు. పుట్టిన బిడ్డలకు పాలివ్వడానికి కూడా తల్లులకు ఇక్కడ సరైన గది లేదు. ఇలాంటి తరుణంలో పిల్లలకు పాలిచ్చే తల్లులు ఫీడింగ్ చేయడానికి ఇబ్బంది పడుతుంటారు. దీని దృష్ట్యా వాసవీ క్లబ్ సభ్యులు ఆస్పత్రిలో తల్లులకు ప్రత్యేకంగా పాలిచ్చే గదిని ఏర్పాటు చేశారు. ఏడాది క్రితం ఏర్పాటు చేసిన ఈ గదిని ఆస్పత్రి అధికారులు మూన్నాళ్ల ముచ్చటగా మార్చేశారు. ఇప్పుడు తాళం వేసి ఉంచారు. దీంతో బిడ్డలకు పాలిచ్చే తల్లులు ఇబ్బందిపడుతున్నారు.

–చిత్తూరు రూరల్ (కాణిపాకం)



తాళం వేసి ఉన్న బేబీ ఫీడింగ్ గది